

అదనపు కలెక్టర్‌కు ఉత్తర్వు కాపీని అందజేస్తున్న నాయకులు

మండల పరిషత్ భవనంలోకి రిజిస్ట్రార్ కార్యాలయం

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ భవనంలోకి తరలించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ కలెక్టర్‌కు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రతిని గురువారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మార్కెట్ డైరెక్టర్ తుంకి భిక్షపతి, మేడ్చల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, తదితర నాయకులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలసి అందజేశారు. ఈ విషయంలో తగు చర్యలను తీసుకుని అసౌకర్యంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ పెద్ద భవనంలోకి తరలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ఈ ఉత్తర్వు ప్రతిని ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు అందజేశారు.



భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఈవీఎంల భద్రతలో జాగ్రత్తలు తప్పనిసరి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను గురువారం ఆయన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తో కలిసి సందర్శించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి వాటిపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. బీఎల్‌వోల పేర్లు ఇచ్చారా? ఓటరు జాబితా పూర్తిచేశారా? అనేది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్వో మంగీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేహమత్‌అలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులు స్వాగతం పలికారు. సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూనె పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందజేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తో కలిసి మండల కేంద్రంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఒక్కో రైతుకు ఎకరాకు సరిపడా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోలప్ప, గోపాల్‌నాయక్, అంజిలయ్య, రాములు, కిష్టయ్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం



పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'వన మహోత్సవం' ఉమ్మడి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. గతేడాది అరకొర లక్ష్యాలు సాధించిన ప్రభుత్వ శాఖలు ఈ ఏడాది కూడా ఈ బృహత్తర కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు దండిగా కురిసినప్పటికీ రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వనమహోత్సవ కార్యక్రమంపై అధికార యంత్రాంగం పెద్దగా శ్రద్ధపెట్టలేదు. కొన్ని శాఖలు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంతో ఉన్నాయి. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 50శాతం కూడా లక్ష్యాలు చేరుకోలేదు. దీన్ని బట్టి ఈ ఏడాది కూడా 70 శాతం కూడా లక్ష్యం చేరే అవకాశం కనిపించడం లేదు.

నీరుగారుతున్న వనమహోత్సవ లక్ష్యం

నాటాల్సింది 2.08 కోట్లు..
నాటింది 1.01 కోట్లే
ఈ ఏడాది మొక్కలు నాటడంలో వెనుకంజ
ఉమ్మడి జిల్లాలో సగం కూడా దాటని టార్గెట్
అలసత్వం వహిస్తున్న పలు ప్రభుత్వ శాఖలు



రంగారెడ్డి జిల్లాలో ఆయా శాఖల లక్ష్యం - నాటిన మొక్కల సంఖ్య (లక్షల్లో)

శాఖలు	లక్ష్యం	నాటిన మొక్కలు	శాతం
పురపాలక	39.07	19.45	49.78
డీఆర్‌డీవో	33.20	17.62	53.07
అటవీ	6.35	3.81	60.00
వ్యవసాయ	4.22	2.44	57.81
పరిశ్రమల	2.76	1.28	46.37
ఎక్సైజ్	1.49	0.52	34.89
ఉద్యాన	1.41	1.16	82.26
విద్యా శాఖ	0.80	0.83	103.70

జిల్లాల వారీగా వన మహోత్సవం వివరాలు (మొక్కలు లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నాటిన మొక్కలు	శాతం
రంగారెడ్డి	89.32	47.15	52.61
వికారాబాద్	48.38	34.82	71.97
మేడ్చల్	70.60	19.80	28.04

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

వర్షాకాలంలో మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో కూడా నగర శివార్లలో విస్తారంగా వనాలను, అటవీ సంపదను పెంచారు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించింది. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి వనమహోత్సవంగా నామకరణం చేసింది. ఇందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ గ్రామంలోని నర్సరీలు ఏర్పాటు చేసి వాటిల్లో వివిధ రకాల

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ శాఖల బురిడీ

వనమహోత్సవం కార్యక్రమం విషయంలో పలు ప్రభుత్వ శాఖలు సర్కార్‌ను బురిడీ కొట్టిస్తున్నాయి. ప్రతిఏటా వనమహోత్సవ లక్ష్యాలను తగ్గించుకుంటున్నాయి. తక్కువ లక్ష్యం పెట్టుకుని ఎక్కువ సాధించినట్లు గణాంకాలు చూపుతున్నాయి. ఉదాహరణకు వనమహోత్సవంలో పెద్దఎత్తున విద్యార్థులను భాగస్వాములుగా చేస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతీ జిల్లాలో విద్యార్థులతో లక్షల్లో మొక్కలు నాటిస్తుంటారు. అయితే విద్యాశాఖ ఈ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఉదాహరణకు రంగారెడ్డిజిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థితో ఒక్కో మొక్క నాటించినా ఏటా 10లక్షలకుపైగా నాటించవచ్చు. కానీ ఈ ఏడాది విద్యాశాఖ కేవలం 80వేలు మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుని తాము లక్ష్యం చేరుకున్నట్లుగా చూపిస్తోంది. ఇదిలా ఉంటే మరికొన్ని శాఖలు అసలు కనీస స్థాయిలో కూడా మొక్కలు నాటలేదు.



విద్య, వైద్యానికి పెద్దపీట

వంద పడకలుగా పరిగి ఆస్పత్రి అప్‌గ్రేడ్
ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

7

జీవన్గి జెడ్పీహెచ్‌ఎస్‌కు మహర్దశ

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు
కొలతలు తీసుకున్న అధికారులు

6



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

పనులు త్వరగా చేపట్టాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సోమారంలో నిర్మిస్తున్న బాలికల ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులతో పాటు టాయిలెట్స్, వంటగదుల నిర్మాణం పకడ్బందీగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ పాఠశాలను, జూనియర్ కళాశాలను సాధ్యమైనంత త్వరగా నూతనం నిర్మిస్తున్న భవనంలోకి మర్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఆయనతో పాటు స్థానిక తహసీల్దార్, భూపాల్, ఆర్‌సీఓ నాగార్జున, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో రాయలసీమ కూత

» నవాంద్గీ రైల్వేస్టేషన్‌లో స్టాప్‌నకు గ్రీన్ సిగ్నల్
» ఫలించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషి



బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా నవాంద్గీ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ ఉండాలన్న బషీరాబాద్ మండల ప్రజల కల త్వరలోనే నెరవేరనుంది. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషితో ఎట్టకేలకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు రైల్వేబోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆయన గురువారం ధ్రువీకరించారు. బషీరాబాద్(నవాంద్గీ) రైల్వేస్టేషన్ మీదుగా రాయలసీమ, హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిత్యం తిరుగుతుంటాయి. ఈ రైళ్లకు ఇక్కడి స్టేషన్‌లో స్టాప్ లేకపోవడంతో హైదరాబాద్, తిరుపతి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్థానిక ఆర్ఎంపీ వైద్యులు జయరాంచారి, మండల నాయకులు, ప్రజలతో కలిసి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని రిలే నిరాహార దీక్ష చేసిన సందర్భాలు ఉన్నాయి. అలాగే అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా రైల్వే బోర్డు అధికారులను కలిసి ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు ఎంతో కృషి చేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుత ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో రైల్వేశాఖ మంత్రి, బోర్డు అధికారులను కలిసి మరోసారి విజ్ఞప్తి చేయడంతో అధికారులు అంగీకరించారు. అలాగే త్వరలో మరో శుభవార్త వింటారని హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా నిలిపేందుకు బోర్డు అంగీకారం తెలుపనుందని ఎంపీ పోస్ట్ చేసిన వీడియోలో వివరించారు.

మహిళలను సంఘాల్లో చేర్పించాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, సెప్టెంబరు 18, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుపేద, పేద మహిళలను మహిళా సంఘాల్లో చేర్పించడం వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మెప్మా సిబ్బంది , రిసోర్స్ పర్సన్స్‌తో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చదువు తప్పనిసరి అని అన్నారు. ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్, ఎస్‌హెచ్‌జీ, పీడబ్ల్యూడీ సంఘాలను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరం 800 సంఘాలకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని, సెల్ఫ్ పాంప్లాయిమెంట్ ప్రొగ్రాంలో అందరికీ బ్యాంకు లోన్లు అందేలా చూడాలన్నారు. లోక కల్యాణ మేళా అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ రవి కుమార్, తాండూరు టీఎంసీ కమిషనర్ వెంకటేష్, టీఎంసీ శ్రీఏన్ రాజేంద్ర ప్రసాద్, వికాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్



తాండూరు గొల్ల చెరువు

గొల్ల చెరువు అన్యాక్రాంతంపై చెన్నై ఎన్‌జీటీలో కేసు

» ప్రతివాదులుగా ప్రభుత్వ అధికారులు

తాండూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు అన్యాక్రాంతం, మురుగు నీరు చేరికపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో కేసు నమోదైంది. తాండూరుకు చెందిన సామాజికవేత్త రాజ్‌గోపాల్ సార్డా ఆరు నెలల క్రితం వేసిన రిట్‌ను గురువారం కోర్టులో అడ్మిట్ చేశారు. మురుగు నీరు.. గొల్ల చెరువు, మల్‌రెడ్డి చెరువులోకి రాకుండా అలాగే బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గొల్ల చెరువులో మిషన్ కాకతీయ కింద 3 నుంచి 4 ఫీట్ల మట్టిని తవ్వి రైతుల పొలాల్లో వేయాలని కోరారు. ఈ కేసులో ప్రతివాదులుగా సబ్‌కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులు, తహసీల్దార్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిని చేర్చారు. ఓఏ నంబర్ 194-2025గాను కేసును స్వీకరించి అధికారులకు నోటీసులు పంపనున్నారు.

అధికారులు బాధ్యత వహించాలి



గొల్ల చెరువు అన్యాక్రాంతంపై చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన కేసును స్వీకరించడం అభినందనీయం. ఆరు నెలల క్రితం రిట్ వేసినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆలస్యం జరిగింది. చెరువు అన్యాక్రాంతంపై అధికారులు బాధ్యత వహించి సత్వరమే డిమాండ్లపై చర్యలు చేపట్టి గొల్ల చెరువును కాపాడాలి.

-రాజ్‌గోపాల్ సార్డా, సామాజికవేత్త



వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు

» ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు

వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని, కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి వ్యాపారం చేస్తుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో వాసుచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వెంటనే రూ.8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో విద్యార్థులు టీసీల కోసం వెళితే యాజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. ముఖ్యమంత్రి కూడా విద్యార్థి దశ నుంచే వచ్చారని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విచారణ తూచ్!

రేషన్‌కార్డుల జారీలో అక్రమాలు
ఫిర్యాదును గాలికి వదిలిన అధికారులు

తాండూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : తాండూరు పట్టణంలోని హుస్సేన్‌నగర్‌లో కొత్తగా రేషన్ కార్డుల జారీలో అక్రమాలు జరిగాయని గతనెలలో లబ్ధిదారులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఐ గోపిపై విచారణ జరపాలని తాండూరు తహసీల్దార్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకే కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఐపై విచారణ జరిపేందుకు తహసీల్దార్ వెనుకంజ వేయడంతో పాటు మరో అధికారిని నియమించాలని విన్నవించారు. దీని తర్వా మరో అధికారిని నియమించలేదు. తహసీల్దార్ సైతం విచారణ జరుపలేదు. ఆర్ఐ గోపి మాత్రం వారం రోజుల పాటు సెలవుపై వెళ్లి తిరిగి విధుల్లో చేరారు. కాగా, ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని పలువురు నాయకులతో పైరవీలు చేసినట్లు సమాచారం. ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు తహసీల్దార్ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే తన నోటీస్‌కు తీసుకరావాలని వారిపె చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ అధికారికంగా ఆర్ఐపై వచ్చిన ఆరోపణలపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

కిష్టాపూర్‌లో కార్డెన్ సెర్చ్

3 అక్రమ మద్యం కేసులు, ఒకటి గంజాయి కేసు నమోదు
18 బైక్‌లు, రెండు కార్లు స్వాధీనం : డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 300 ఇళ్లను తనిఖీ చేశారు. 1000 మంది వివరాలను సేకరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై మూడు కేసులు నమోదు చేశారు. అలాగే ఒక గంజాయి కేసును నమోదు చేశారు. పెండింగ్ చలానాలు ఉన్న 188 వాహనాల యజమానుల వద్ద నుంచి రూ.91 వేలు వసూలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ 15 వాహనాలను సీజ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి

అప్రమత్తంగా ఉండాలి

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు పాత నేరస్థుల కదలికల పట్ల స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నేర నియంత్రణ కోసం కాలనీల్లోని కూడళ్ల వద్ద, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శంకర్‌రెడ్డి, స్థానిక సీఐ సత్యనారాయణలతో పాటు మరో 10 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, ఏఆర్, ఎస్ఓటీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎం వైఖరిని నిరసిస్తూ బస్సులు బంద్


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు

పరిగి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రైవేట్ బస్సుల సేవలు నిలిచిపోయాయి. డిపోలో ఉన్న 31 బస్సులు ఉండగా నడపలేమని ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు నిరసనకు దిగారు. డీఎం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సీటింగ్ కేపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవాలని డీఎం ఒత్తిడి చేస్తున్నారని డ్రైవర్లు ఆరోపించారు. ఒక్కోసారి బస్సులో 140 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఇంకా ఎక్కించుకోవాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్టింగ్ కేపాసిటీపై స్పష్టమైన హామీ ఇవ్వడంతోపాటు, తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా బస్సులను నిలిపివేయడంతో షాద్‌నగర్, మహబూబ్‌నగర్ రూట్లలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వందలాది మంది ప్రయాణికులు బస్ స్టేషన్‌లో గంటలతరబడి వేచి ఉన్నారు. అయితే ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు తమను సంప్రదించకుండానే బస్సులను నిలిపివేశారని డీఎం సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా వికారాబాద్, ఇతర డిపోలకు చెందిన బస్సులను నడిపించామని చెప్పారు.

వెదురు ఉత్పత్తులను

ప్రోత్సహించాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని మహేంద్ర (మేదర) సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మేధరి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వెదురు ఉత్పత్తుల వాడకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మేధర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెర్రీగల శ్రీనివాస్, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భూపతి గల్ల మహిపాల్ తదితరులున్నారు.

జీవన్గి జెడ్పీహెచ్‌ఎస్‌కు మహర్దశ

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే చొరవతో కొలతలు తీసుకున్న అధికారులు

తొలగనున్న తరగతి గదుల కొరత


కొలతలు తీసుకుంటున్న ఏఈఈ యశ్వంత్, అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవన్గి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానికుడు, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి గురువారం పంచాయతీరాజ్ శాఖ ఏఈని పాఠశాలకు పిలిపించి దగ్గరుండి కొలతలు తీయించారు. ఇక్కడి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి సరిపోను గదులు లేక రెండు తరగతులకు వరండాలో బోధిస్తున్నారు. మరికొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఏఎంసీ చైర్మన్‌తోపాటు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను ఇటీవల కలిసి తరగతి గదుల కొరతపై విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులు కొలతలు తీసుకున్నారు. పురాతన తరగతి గదులను కూల్చేసి భవనం నిర్మించాల్సి ఉండటంతో ఖర్చుపై అంచనాలు తయారు చేస్తామని ఏఈ వెల్లడించారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తక్షణమే సీఎంఆర్ అందజేయాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే యాసంగికి సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు తక్షణమే అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. బ్యాంకు గ్యారెంటీ లేకుండా ప్యాడీ ఇవ్వడానికి వీలు లేదని, తప్పనిసరిగా బ్యాంకు గ్యారెంటీ ఉండాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ మోహన్ కృష్ణ, అధికారులు సుదర్శన్, శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే నివేదికను సంబంధిత శాఖల సమన్వయంతో తయారు చేయాలని సూచించారు. జిల్లాలో చిన్న తరహా ఖనిజాలు, ఇసుకకు పర్యావరణ అనుమతి కోసం జిల్లా సర్వే నివేదికను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా మైనింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్‌ఈ సీతారాం, ఈఈ పీఆర్ ఉమేష్‌కుమార్, గ్రౌండ్ వాటర్ అధికారి రవి, టీజీఎండీసీ శ్రీకాంత్, ఆర్‌అండ్‌బీ శ్రీధర్‌రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కేశంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని, ఆపత్కాలంలో ప్రజలకు సహాయం అందిస్తానని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండలంలోని కొత్తపేట, ఇప్పలపల్లి గ్రామాల్లో పర్యటించారు. కొత్తపేట గ్రామానికి చెందిన రమేష్, లక్ష్మమ్మ, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన అశ్విత్, అక్షయ్‌లను మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, నవీన్ కుమార్, తలసాని వెంకట్ రెడ్డి, అంజనేయులు, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

సత్తాచాటిన చౌదరిగూడ పాఠశాల

టీఎల్‌ఎం మేళాలో రెండో బహుమతి



చౌదరిగూడ,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళా పోటీల్లో జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి రెండో బహుమతి వచ్చింది. గురువారం రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో చౌదరిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రదర్శించిన తెలుగు బోధనోపకరణలు జిల్లా స్థాయిలో ఆకట్టుకున్నాయి. డీఈవో సుశీందర్‌రావు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలామోహన్ నాయక్‌కు రెండో బహుమతి కింద మెమెంటోతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు సర్టిఫికెట్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మెప్మా ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారం సక్రమంగా నిర్వహించుకోవడానికి అన్ని అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్, టీఎంసీ నరేష్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ట్రైనీ శివాని పాల్గొన్నారు.

ఇంకా కొనసాగుతున్న విచారణ

» అక్రమ రిజిస్ట్రేషన్లపై ఎటూ తేల్చని రిజిస్ట్రేషన్ శాఖ



తాండూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మే 12వ తేదీ నుంచి 18వ తేదీ మధ్యన జరిగిన సుమారు 220 ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ ఇంకా కొనసాగుతునే ఉంది. జరిగిన రిజిస్ట్రేషన్లను క్రమబద్ధీకరిస్తారా, లేక చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తారా, లేదా భారీ జరిమానాలు విధిస్తారా? అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతోపాటు రిజిస్ట్రేషన్ జరిగినా హక్కు పొందలేకపోతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ఇప్పటికే ఇద్దరు అధికారులను సస్పెండ్ వేసి చేతులు దులుపుకున్నారు. అప్పట్లో దీనిపై రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిరియస్‌గా పరిగణించి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ వెంకటరమణ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ చేత కూడా విచారణ జరిపించారు. అయితే విచారణ నివేదికల వరకే సరిపోవడం ఆరోపణలకు దారితీస్తోంది. దీంతో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక కమిటీ వేసి వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

నాలుగు దశాబ్దాలు.. 51 లక్షలకుపైగా సర్జరీలు

» అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి 42వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుందని, దాదాపు 200 మిలియన్లకు పైగా మందికి వైద్య సేవలు అందించడంతోపాటు 185 దేశాల్లో నమ్మకాన్ని సంపాదించిదని అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనను జారీ చేశారు. 1983లో భారతదేశంలో మొట్టమొదటి కార్పొరేట్ ఆసుపత్రిగా ఏర్పడి 19,000కు పైగా కీలకమైన ప్రాంతాలను చేరుకుందని ప్రకటించారు. అపోలో నాలుగు దశాబ్దాల్లో 51 లక్షలకుపైగా శస్త్రచికిత్సలు, 27వేలకు పైగా అవయవ మార్పిడి, 22 వేలకుపైగా రోబోటిక్ సర్జరీలు, మూడు మిలియన్లు నివారణ ఆరోగ్యపు పరీక్షలు, 20 మిలియన్లకుపైగా డయాగ్నస్టిక్ పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. అపోలో 11 లక్షలకుపైగా నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాము ఆసుపత్రులను మాత్రమే కాకుండా, మానవ వనరులను తీర్చిదిద్దామని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతరెడ్డి పేర్కొన్నారు. దక్షిణాసియాలో మొట్టమొదటి ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్, దేశంలో మొట్టమొదటి ఏఐ - ప్రెసిషన్ ఆంకాలజీ సెంటర్, మొట్టమొదటి సైబర్‌నైఫ్ రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్ వంటి వాటిలో కీలకంగా ఉందన్నారు. ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా, దానిని అంచనా వేయడానికి, నివారించడానికి, ఏకీకృతం చేస్తున్నామని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు.

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

కడ్తాల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్విరాజ్ యాదవ్ హెచ్చరించారు. విద్యుత్ హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చే వరకు భూ నిర్వాసితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరాయి. దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, క్యామ మహేశ్, మొగిలి చెన్నయ్య, డేరంగుల నాగార్జున, చెన్నమోని కృష్ణ, కార్తీక్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్ పాల్గొని సంఘీబావం ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పెంటారెడ్డి, పర్వత్‌కుమార్, రాములు ఉన్నారు.

ఎబ్బనూర్ నకిలీ ఓటర్లపై విచారణ

ధారూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎబ్బనూర్ గ్రామంలో నకిలీ ఓట్లు ఉన్నాయని అందిన ఫిర్యాదుపై డీఆర్వో రెండు రోజుల పాటు విచారణ జరిపారు. ఓటరు జాబితాలో 52 మంది ఓటర్లు స్థానికంగా లేరని, దొంగ ఓటర్లు ఉన్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నకిలీ ఓటర్లకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరగా రెండు వారాలు గడువు కోరారని తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. గురువారం డీఆర్వో మంగీలాల్ గురువారం జరిపిన విచారణకు 26 మంది హాజరుకాగా, ఇందులో 22 మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. మిగతా నలుగురు తమ ఓట్లు ఎబ్బనూర్‌లోనే ఉన్నాయని వాదించారని, వీరి ఓట్లు తాండూర్ ఓటరు జాబితాలో ఉన్నట్లు అనుమానం ఉందని,విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

పట్నంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని పలు సంక్షేమ వసతి గృహాలను గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. చెర్లపటేల్‌గూడ వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్, తట్టిఖానా రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన వడ్డిస్తున్నారా, లేదా అని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఫుడ్ సేఫ్టీ అధికారి, అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్లు రామకృష్ణ, రవీందర్ నాయక్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలి

కందుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలతోపాటు పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, సీఐటీయూ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు, పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో సరితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జగన్, మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్, నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

మంచాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని, దీంతో దిగుబడి పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలో వారందించిన కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలతో సాగు చేసిన పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట తర్వాత ధాన్యాన్ని మళ్లీ విత్తనంగా వాడుకోవాలని సూచించారు. విత్తనాలు తయారు చేసి ఇతరులకు విక్రయించి లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవో లింగస్వామి, రైతులు రవీందర్‌రెడ్డి, పాండయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

చేవెళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడిని సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ సుజాత అన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మెర, రావులపల్లి గ్రామాల్లో వరి పైరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో క్యూఎస్ఈవీ కార్యక్రమం కింద జూన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సౌజన్యంతో రైతులకు వరి, జొన్న, కంది విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బాలకోటేశ్వర్‌రావు, రైతులు ఉన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)



షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ నర్సరీ

మొక్కలను పెంచుతున్నారు. ఈ మొక్కలను వర్షాకాలం ఆయా శాఖలకు పంపిణీ చేసి వాటిని నాటిస్తున్నారు. అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 18 ప్రభుత్వ శాఖల ద్వారా ఈ వనమహోత్సవ కార్యక్రమాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీ నుంచి వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రజలను భాగస్వాములుగా చేసి పెద్దఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో వీటిని సరిగా అమలు చేయడంలో ఆయా శాఖలు విఫలమవుతున్నాయి. నగర శివార్లలో శరవేగంగా సాగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో విస్తారంగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం శివార్లలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించింది. కానీ ప్రతిఏటా లక్ష్యాల మేర మొక్కలు నాటి పెంచడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 2.08కోట్లు..

ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమం కింద మూడు జిల్లాల్లో 2.08కోట్ల మేర మొక్కలు నాటాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు కేవలం 1.01 కోట్ల మేర మాత్రమే మొక్కలు నాటారు. నేటికీ గ్రామాల్లో నర్సరీల ద్వారా పెంచిన మొక్కలు సగం కూడా పంపిణీ కాలేదు. నర్సరీల నుంచి వివిధ ప్రభుత్వ సంస్థలకు పంపిణీ చేసిన మొక్కలు ఆయా శాఖల వద్ద లక్షల్లో ఇంకా నాటకుండా అలాగే ఉన్నాయి. ఆయా నర్సరీల నుంచి ఇలా తీసుకున్న మొక్కలు నాటకపోయినప్పటికీ లక్ష్యాలకు సమీపంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఆరు మొక్కల పంపిణీని కూడా అంతంత మాత్రంగానే చేశారు. ఇప్పటికే సెప్టెంబర్ మాసం సగం గడిచిపోవడంతో ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలో 89.32లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 52.61శాతం మాత్రమే పూర్తయ్యింది. అలాగే వికారాబాద్‌లో 71.97శాతం పూర్తి కాగా, మేడ్చల్‌లో కనీస స్థాయిలో కూడా ఈ కార్యక్రమం సాగలేదు. ఇక్కడ కేవలం 28.04శాతం మాత్రమే మొక్కలు నాటడంతో ఈ ఏడాది 50శాతం కూడా లక్ష్యం చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

» రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



డాక్టర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో గురువారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసినట్లు చెప్పారు. సరూర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా తడకంటి శృతి, రాజేంద్రనగర్ మండలం పాండు రంగానగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా డి. స్వేత, అబ్దుల్లాపూర్‌మెట్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా కె.శ్రీనివాస్, మీర్‌పేట్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా అఖిల శ్రీనిధి, ఉప్పర్‌పల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా హస్నా ఫాతీమా, శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా ఎండీ ఆవైస్‌కు నియామకపత్రాలను అందించారు. కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలపరిమితికి రూ.52 వేల జీతంతో డాక్టర్లు విధులు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వారం రోజుల్లో విధుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ శఫియోద్దీన్, జిల్లా ప్రోగ్రాం అధికారి అక్రం, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున్ తదితరులున్నారు.

గురుకులంలో పూల పండుగ



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. వేడుకల్లో అధ్యాపకురాలు, కల్చరర్ కోఆర్డినేటర్ ధనవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులకు రుణమాఫీని అమలు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 9వ రోజుకు చేరుకున్నాయి. గురువారం నాటి దీక్షలలో మహిళలు కూర్చున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన వారికి మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా స్థానిక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఘట్‌కేసర్‌లోని గాంధీ విగ్రహంకు వినతిపత్రం ఇంచి నిరసన వ్యక్తం చేశారు.

అక్రమ బదిలీలను నిలిపివేయాలి

» సేవ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి

యాచారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు నియమించిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని సేవ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాచారం మండలంలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, మాల్‌మార్కెట్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. 317 జీవో ద్వారా జిల్లాలోకి క్యాడర్ సామర్థ్యానికి మించి ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డికి కేటాయించారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను అ మలు కోసం పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలగకుండా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

కందుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ రాంచంద్రుడు అన్నారు. గురువారం ఆయన మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యతోపాటు అన్ని ఆసక్తి ఉన్న అన్ని రకాల క్రీడల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విజయమోహన్, ఉపాధ్యాయులు గ్లోరి, శ్రీవాణి, గిరి, డాక్టర్ ఎండీ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలి

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కిషన్‌నగర్ శివారులోని పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్ - 14, 17 స్కూల్ గేమ్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ధృడంగా ఉంటారని, వారిలోని ప్రతిభను వెలికి తీస్తే అద్భుతమైన క్రీడాకారులుగా రాణిస్తారని తెలిపారు. ప్రస్తుతం జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన వారు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని పేర్కొన్నారు. క్రీడలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఎంఈఓ మనోహర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, వాడ్యాల నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ భువనేశ్వర్ దాక్షాయిని, అశోక్, జోనల్ సెక్రెటరీ బాలయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, జగదీష్, లక్ష్మణ్, అనిత, సంగీత, శ్రీలత, రవి కుమార్, సుజాత ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి రూ.14.6 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్ గౌడ్, తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఆర్ఆర్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో పరిగి ప్రభుత్వ వైద్యశాలలో గురువారం మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిగి ఆస్పత్రిని రూ.27 కోట్లతో వంద పడకల ఆస్పత్రిగా మారుస్తున్నట్లు తెలిపారు. అలాగే పరిగి మినీ స్టేడియంలో అండర్-14, అండర్-17 బాల, బాలికల కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఎంలు సిద్ధాంతి ప్రవీణ్‌కుమార్, రవీంద్రయాదవ్, పరిగి సూపరిండెంట్ రాజశేఖర్, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు పరశురాం రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పార్టీ దోమ, పూడూరు మండలాల అధ్యక్షులు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

'పాంబండ'ను పర్యాటక కేంద్రంగా మారుస్తాం

కులకచర్ల: కులకచర్ల మండలంలోని పాంబండ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ టూరిజం ఈడీ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆలయంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భరత్‌రెడ్డి, ఎల్లప్ప ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

షాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉబ్బగుంట గ్రామానికి చెందిన బుడ్డమోళ్ల చంద్రయ్య (60) రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు పొలానికి వెళ్లాడు. పంటకు నీరు పెడదామని మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. అది గమనించిన అతని కుమారుడు రాజు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. 108లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చంద్రయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమ్ముడు బుడ్డమోళ్ల దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఆర్‌సీని అమలు చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ.. ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. 30 నుంచి 40 ఏళ్ల సర్వీస్ చేసిన ఉద్యోగికి రిటైర్ అయిన తర్వాత పెన్షన్ లేకపోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అక్బర్, సభ్యులు కిరణ్, మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, నర్సింహులు ఉన్నారు.

తాగునీటి కోసం తంటాలు



యాచారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు వారం రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు గోస పడుతున్నారు. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గాండ్లగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. గురువారం గాండ్లగూడ గ్రామానికి వాటర్ ట్యాంకు రావడంతో జనం నీరు పట్టుకునేందుకు ఎగపడ్డారు. ఉదయం ఒక్క పూట మాత్రమే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

» డీపీవో సురేశ్‌మోహన్



ధన్నారంలో డీపీవో సురేశ్‌మోహన్

కందుకూరు,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకోసం పంచాయతీ కార్మికులకు సహకరించాలని డీపీవో సురేశ్‌మోహన్ అన్నారు. గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో మండలంలోని 35 గ్రామ పంచాయతీలలో చేపట్టిన పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు ధన్నారం గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలలో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఎంపీవో గీత, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి ఎమ్మెల్యేల బర్త్‌డే విషెస్



వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని గురువారం ఆయనను జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఆయనను చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీలారం మహిపాల్‌రెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీకి సాయుధ రైతాంగ పోరాటంపై మాట్లాడే హక్కు లేదు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ధారూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై బీజేపీకి మాట్లాడే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. సాయుధ రైతాంగ పోరాట యోధులకు ఆయన పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం పాలన తరహాలోనే ప్రధాని మోదీ పాలన సాగుతోందని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కమ్యూనిస్టుల పోరాట చరిత్రను వక్రీకరించి తూడిచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ గడ్డపై బీజేపీ మత రాజకీయాలను సాగనివ్వమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుదర్శన్, లక్ష్మయ్య, వెంకటయ్య, మల్లయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' తెచ్చిన తంటా.. తీరెదెట్లా?

- సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా భూసమస్యలు
- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తరాల మారినా భూసమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని బాధితులు వాపోతున్నారు. 'ధరణి' తెచ్చిన తంటతో తమ సమస్యలు తీరేదెట్లా? అని సతమతం అవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. బొంరాస్‌పేట్ మండల పరిధిలోని గట్టెనాయక్ తండాతో పాటు కుబ్యానాయక్ తండా, టేకులగడ్డ తండా, మదన్‌పల్లి, బురాన్‌పూర్, సాలిండాపూర్ గ్రామాల రైతులకు సంబంధించి భూసమస్యలు ఏళ్లుగా పరిష్కారం కావడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత తండాలు, గ్రామాల రైతులు అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడంలేదని చెబుతున్నారు.ఈ గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 128లో 400 ఎకరాల భూములు ఉన్నాయి. ఇప్పటికీ అట్టి భూములు ప్రభుత్వ భూములా, పట్టా భూములా? అనేది అధికారులు తేల్చలేకపోతున్నారు. తమ పూర్వీకుల నుంచి ఇందిరమ్మ తెచ్చిన దున్నే వాడిదే భూమి సీలింగ్ యాక్టు ప్రకారం అప్పట్లోనే ఈ రైతులు భూములు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన గట్టేనాయక్ తండా రైతులు

పాస్ పుస్తకాలు చెల్లవంటున్న అధికారులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ధరణి చట్టం అమలులోకి రావడంతో అప్పటి వరకు ఉన్న పాసుపుస్తకాలు, పట్టాదారుల వివరాలు తొలగిపోయాయి. రైతులు తమ పాస్‌పుస్తకాల ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకొని యజమానులుగా కొనసాగుతున్నారు. అయితే ధరణి చట్టంతో రైతుల పాస్‌పుస్తకాలు చెల్లవని ప్రభుత్వం, అధికారులు నూతన పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఆందోళనకు గురిచేస్తున్నారని వాపోయారు. సర్వేనంబరు 128లో గట్టేనాయక్ తండాకు చెందిన రైతులు 105ఎకరాల్లో పంటల సాగుతో పట్టాపాసుబుక్‌లు కలిగి ఉన్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో రైతులకు తెలంగాణ పాస్‌పుస్తకాలు రాక, ధరణిలో పేర్లు నమోదు కాకపోవడంతో గిరిజన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అప్పటి నుంచి మండల అధికారులతో పాటు జిల్లా అధికారులతో మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆశ్రయించారు. ప్రభుత్వ నివేదికల మేరకు 128 సర్వే నంబర్‌లో 350 ఎకరాలు భూములు ఉన్నాయి, మరో 80 ఎకరాలు అదనంగా ఉండటంతో రైతులకు నూతన పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మండల తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేస్తూ పూర్తి విచారణ చేపట్టాలన్నారు.

భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు

ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి మా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చి బ్యాంకు రుణాలు తీసుకునేందుకు సహాయ పడ్డారు. ధరణి కారణంగా పట్టాదారుల పాసుపుస్తకాలు రద్దయ్యాయి. సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

- కేతావత్ వంశీకృష్ణ, గట్టేనాయక్ తండా

చేతివృత్తుల వారిని ఆదుకోవాలి

▶▶ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కీసర రూరల్/ఘట్‌కేసర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వెదురు చేతి వృత్తుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. గురువారం నాగారం మున్సిపాలిటీలో మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం న్విహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు రాంపల్లి చౌరస్తా నుంచి సంక్షేమ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వెదురు కొనుగోలులో రాయితీ ఇప్పించాలని, తమ వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అనంతరెడ్డి, నాయకులు శ్రీధర్, సాయినాథ్‌గౌడ్, మేదరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గురువారం పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని పీహెచ్‌సీలో 8వ జాతీయ పోషణ మాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండటానికి నిత్యం కొంత సమయం నడకతోపాటు వ్యాయమం, యోగా సాధన చేయాలని సూచించారు. నేడు అన్ని రకాల వైద్య పరీక్షలను స్థానిక ఆసుపత్రులలో చేస్తున్నందున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, రెడ్డియా, నర్సింహ, సాయిరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

▶▶ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుతో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన కొడంగల్‌లో గురువారం పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుతో ప్రజలకు మేలు చేయాలన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల రాజీనామాతో ఉప ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికల నిర్వాహణలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తితో కొడంగల్ ప్రాంతానికి లక్ష ఎకరాలకుపైగా సాగు నీరందించేందుకు చేపట్టిన ప్రాజెక్టును పక్కన పెట్టారని ఆరోపించారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం తెరపైకి తెచ్చినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. రైతులకు ఉపయోగపడే యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా అమలును సక్రమంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల యాదగిరి, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌యాదవ్, శేరి నారాయణరెడ్డి, కోట్ల మహిపాల్, రమేశ్‌బాబు, నవాజ్, నర్మద కిష్టప్ప, భీములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో గురువారం మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ రహెమాన్, ఎంపీడీవో అనురాధ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ముస్తఫా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు చిట్టి మల్లారెడ్డి, రావుగారి వెంకట్‌రెడ్డి, తలారి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ ఎక్బాల్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం, జ్ఞాపికతో సన్మానించారు. మండలం నుంచి జిల్లా అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయడిని శేఖర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఉపాధ్యాయులు సుధాకర్, విక్రమ్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా, కేజీబీవీ ప్రత్యేకాధికారి శైలజ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి నిరంతరం శ్రమించాలని ఘట్‌కేసర్ మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో గురువారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కోలుకుంద, మేకవనంపల్లి, మోమిన్‌పేట్, రామ్‌నాథ్‌గూడుపల్లి, చంద్రశేఖర్‌నగర్, అమ్రాది కుర్దు, చక్రంపల్లి, టేకులపల్లి, అమ్రాది కలాన్, కేసారం, టేకులపల్లి, చంద్రయన్‌పల్లి, మొరంగపల్లి పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో మల్లేశం శాలువా, పూలమాలలతో సన్మానించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 16 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, రమేశ్, ప్రభాకర్, మధుకర్, పద్మారావు, సురేశ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ జన్మదిన వేడుక



యాదగిరిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింలుయాదవ్, కృష్ణారెడ్డి, అఫ్జల్‌ఖాన్

శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ యాదగిరిరెడ్డి జన్మదిన వేడుకలను వివిధ పార్టీల నేతలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ యాదగిరిరెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కమటం క్రిష్ణరెడ్డి, మహ్మద్ అఫ్జల్‌ఖాన్, బీఆర్ఎస్ మండల నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, తదితర నాయకులు అభినందిస్తు పూలమాలలు వేసి, శాలువాలను కప్పి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలిసిన నాయకులు

బొంరాస్‌పేట్/దుద్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని బొంరాస్‌పేట్, దుద్యాల మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. బొంరాస్‌పేట్‌లో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సీఎంతో కోరగా అధికారులతో స్థల పరిశీలనతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రమేశ్, నర్సిములు, హన్మయ్య, నర్సిములుయాదవ్ పాల్గొన్నారు. అదే విధంగా దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనంతయ్య, ప్రభు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి, చేపట్టబోయే పనుల గురించి చర్చించినట్లు వారు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



స్నాతకోత్సవంలో పట్టాలను పొందిన విద్యార్థులు

శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ మోడల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీరం వెంకటరమణ అన్నారు. అలియాబాద్ చౌరస్తా సమీపంలో గల అశ్లేష ఐటీఐ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ దామోదర్ ఆధ్వర్యంలో 2023-25 బ్యాచ్ విద్యార్థులకు స్నాతకోత్సవంలో పట్టాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఐటీఐలో పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు ఐటీఐ చదివిన విద్యార్థులు మంచి ప్రవీణ్యతను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆకాంక్షించారు. శ్రీక్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువును కొనసాగిస్తూనే పరిశ్రమలకు కావాల్సిన ప్రావీణ్యతను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ కరుణకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

దుద్యాల: నేషన్ మిషన్ ఆన్ ఎడిటబుల్ ఆయిల్ సీడ్ పథకం కింద 450 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రానికి వచ్చాయి. వీటిని గురువారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, వ్యవసాయ అధికారి నాగరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య పంపిణీ చేశారు.

కులకచర్ల: స్థానిక రైతు వేదికకు 1090 వేరుశనగ బస్తాలు వచ్చినట్లు ఏవో వీరస్వామి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తామన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

కులకచర్ల: ఏబీవీపీ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి నగర కార్యదర్శి ఎన్.గణేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మండల కన్వీనర్‌గా హనుమంతు, ఉపాధ్యక్షుడిగా మహేశ్, సంయుక్త కార్యదర్శిగా గౌతమ్, మారుతి, మహిళా కన్వీనర్‌గా సింధు, కళామంచ్ కన్వీనర్‌గా అంకిత, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా భరత్‌కుమార్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా వినయ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా భరత్, ఖేల్ కన్వీనర్‌గా అరవింద్‌ను ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం

ధారూరు/కోట్‌పల్లి: ధారూరు పీహెచ్‌సీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దంత వైద్యురాలు డాక్టర్ సుధా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 102 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో అసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శాంతి పాల్గొన్నారు. అదేవిధంగా కోట్‌పల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వికారాబాద్ జనరల్ మెడిసిన్ డాక్టర్ సౌమ్య, కోట్‌పల్లి డాక్టర్ మేఘన వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఖయ్యూమ్, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింహ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

కోట్‌పల్లి: పింఛన్లు పెంచాలంటూ ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి భరత్‌కుమార్ గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు పింఛన్ లబ్ధిదారులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

కొనసాగిన 'పోషణ-పౌష్టికాహారం'

యాలాల: పోషణ-పౌష్టికాహారం కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఐసీడీఎస్ ప్రాజెక్టు అగ్గనూరు రైతు వేదికలో యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు బాలామృతంతో తయారు చేసి స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో యాదయ్య పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాలి

నవాబుపేట: ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. చిట్టిగిద్ద, చించల్‌పేట్, దాదాపూర్, వట్టిమీనపల్లి, యావపూర్ గ్రామాలకు చెందిన రైతులు గురువారం చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు.

గ్రామ అభివృద్ధికి సహకరిస్తా

మేడ్చల్ టౌన్: మునీరాబాద్ గ్రామ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. ఆయన మున్సిపల్ పరిధిలోని మునీరాబాద్ గ్రామాన్ని గురువారం సందర్శించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

యాలాల: గ్రామాలు, పాఠశాలలు, దేవాలయాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన తాండూరు-కొడంగల్ రోడ్డు మార్గంలోని రసూల్‌పూర్ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, రవ్యానాయక్, విజయ్‌కుమార్, నర్సింహులు, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

కీసర రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలే కాదు పౌరుల ప్రాణ రక్షణలోనూ ముందుంటామని పోలీసులు నిరూపించారు. క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కీసర పోలీసులు ఆస్పత్రికి తరలించి అతడి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళ్తే విబూది దశరథ అనే వ్యక్తి సెంట్రింగ్ పని చేసుకుంటూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాలలో నివాసముంటున్నాడు. కాగా మద్యం సేవించి తరచూ భార్యతో గొడవ పడుతుంటాడు. అదే తరహాలో గురువారం ఉదయం పనికి వెళ్లకుండా భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. స్థానికులు వెంటనే డయల్-100కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కీసర పోలీస్ పెట్రోల్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది లింగం, రాజులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. తలుపులు విరగ్గొటి లోపలికి వెళ్లి స్థానికుల సాయంతో ఉరేసుకున్న దశరథను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదన్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యక్తి ప్రాణాలు కాపాడినందుకు పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

చెట్టుకొమ్మ విరిగిపడి విద్యార్థికి గాయాలు

బషీరాబాద్/తాండూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు వచ్చిన ఓ విద్యార్థిపై చెట్టు కొమ్మ విరిగిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగింది. బషీరాబాద్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్(స్కూల్ పెడరేషన్ గేమ్)క్రీడా పోటీలు జరుగగా కబడ్డీ పోటీలకు సిద్ధమవుతుండగా యలాల, తాండూరు మండలాలకు విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల మైదానం మధ్యలో ఉన్న చెట్టు కిందకు ముగ్గురు విద్యార్థులు వెళ్లి నిలబడ్డారు. ఈక్రమంలో తాండూరు మండల జినుగుర్తి మోడల్ స్కూల్ విద్యార్థి సుశాంత్‌పై రావిచెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగి తలపై పడింది. దీంతో అక్కడున్న ఈటీ, పీడీలు బాలుడిని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. దీంతో గురువారం జరగాల్సిన క్రీడా పోటీలను రద్దు చేశారు. గాయాలపాలైన విద్యార్థిని తాండూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి పరామర్శించారు.

తప్పుడు అనుమతితో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

యాలాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తప్పుడు అనుమతితో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోవిందరావుపేటకు ట్రాక్టర్‌లో పాత తాండూరు వాగు నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి పొందారు. అయితే అక్కడి నుంచి కాకుండా గోవిందరావుపేట నుంచి ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు ఆపి తనిఖీ చేయగా, తాండూరు అనుమతి చూపించడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

బషీరాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని మైల్వార్ గ్రామంలో పేకాట స్థావరంపై బషీరాబాద్ పోలీసులు గురువారం దాడి జరిపి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలోని బక్కప్ప ఇంటి వద్ద ఖాళీ స్థలంలో బక్కప్ప, కందెనెల్లి యాదయ్య, గుండెపల్లి అశోక్ పేకాట ఆడుతున్నట్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారిని పట్టుకుని వారి వద్ద నుంచి పేక ముక్కలు, డబ్బులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు.

ప్రాణం పోతేగానీ పనులు చేయరా?



గుంతలను పూడ్చుతున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాణం పోతే కానీ అధికారులు మొద్దునిద్ర వీడడం లేదు అనడానికి ఇదే ఉదాహరణ అని స్థానికులు అంటున్నారు. కొత్తగడి వద్ద బుధవారం బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి డీసీఎంను ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు గురువారం గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. ఇదేపని ముందే చేస్తే ఒక నిండు ప్రాణం పోయేది కాదుకదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. వికారాబాద్‌లో ఏరోడ్డు చూసినా గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. సదాశివపేట రోడ్డు, పరిగి రోడ్డు, హైదరాబాద్ రోడ్డుతో పాటు వివిధ రోడ్లు అధ్వానంగా మారాయి. అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరయ్యాయని చెబుతున్న పాలకులు ముందుగా రోడ్లను బాగుచేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతల పూడ్చివేతను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పట్లూర్ రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాలతో గురువారం కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై గుంతలను మొరంతో జేసీబీ సాయంతో పూడ్చి వేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌యాదవ్, నాయకులు సురేశ్, మన్నె సురేశ్, ఫసియోద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

చౌడాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని నిర్సట్ తండా గ్రామంలో పలువురు లబ్ధిదారులకు గురువారం సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములమ్మ శేఖర్, రాజు, వాల్యానాయక్, మేకల వెంకటయ్య, నార్యనాయక్ పాల్గొన్నారు.

దుద్యాల: ఆలేడ్ గ్రామానికి చెందిన పలువురికి కాంగ్రెస్ నాయకులు గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గడ్డమీది రాజుకు రూ.లక్ష, గొల్ల మల్లేశ్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50వేలు, పల్లవికి రూ.45వేలు, ఆంజనేయులుకు రూ.41వేలు, గడ్డమీది అనితకు రూ.30వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతయ్య, అశోక్, నర్సిములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.